ప్రజాశక్తి
సోమవారం 2 డిసెంబర్ 2024 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





నేలకొరిగిన వరి

- రైతుల్లో తుపాను అలజడి
- వరి నూర్పిడి నిలిపివేత
- రోడ్లపైనే ధాన్యం రాసులు
- కృష్ణాలో 8.8 మిల్లీమీటర్ల వర్షం



చల్లపల్లి మండలంలో నేలకొరిగిన వరి వంట

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, గన్నవరం, చల్లపల్లి

తుపాను కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షపు జల్లులు పడుతుండటంతో కృష్ణాజిల్లాలో పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. తుపాను ప్రభావంతో యంత్రాలతో వరి నూర్పిడిని నిలిపివేశారు. వర్షాలకు ముందు యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యంలో కొంత మాత్రమే రైతులు మిల్లులకు చేరవేయగలిగారు. కంకిపాడు, పామర్రు, గూడూరు, పెడన, చల్లపల్లి తదితర ప్రాంతాల్లో ధాన్యం రాసులు, ధాన్యంతో నింపిన సంచులు రహదారులపై దర్శనమిస్తున్నాయి. వాహనాలు అందుబాటులో లేకపోవడం, మిల్లర్లు అభ్యంతర పెట్టడం వంటి కారణాలతో రైతులు నూర్చిన ధాన్యం మిల్లులకు రవాణా చేయలేకపోయారు. ధాన్యం రాసులు, సంచులపై టార్బాలిన్‌లు కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆరబెట్టే అవకాశం లేక రాసులుగా నిల్వ చేయడం, సంచుల్లో నింపడంతో ధాన్యం రంగు మారిపోతుందని, ఈ ధాన్యానికి మిల్లర్లు ధరలో కోత పెడతారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులకు కోతలు కోయని పొలాల్లోని అక్కడక్కడా వరి నేలవారుతోంది. దీని నూర్పిడికి అదనంగా వ్యయం చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

తుపాన్ ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలుల వల్ల గన్నవరం, చల్లపల్లి ప్రాంతాల్లోని వరి పైరు నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి తగ్గుతుందని మదనపడుతున్నారు. డెల్టా గ్రామాల్లో సన్నకారు, కౌలు రైతులు ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చేటప్పటికి ప్రకతి వైపరీత్యాల కారణంగా ప్రతి యేటా పంట నష్టం కలుగుతుంది. అప్పులు చేసి పంటలు పండిస్తుంటే పంట చేతికి వచ్చే సమయానికి వర్షాల కారణంగా ప్రతి ఏటా నష్టపోతున్నామని కౌలుదారులు తెలిపారు. ఈ ఏడాది వాతావరణ అనుకూల పరిస్థితుల కారణంగా పంటలు సమృద్ధిగా పండాయని ఆశించిన రైతులకు తుపాను ప్రభావంతో నిరాశే ఎదురైంది. ఈ ఏడాది ఎకరానికి 36 నుంచి 42 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలకు తుపాన్ ప్రభావంతో చేతికి వచ్చిన పంట నేలపై ఒరిగిపోవడంతో దిగుబడి తగ్గే పరిస్థితి వచ్చింది. ఎకరానికి 16 వేల రూపాయలు ఖర్చు పెట్టామని గన్నవరం మండలం అల్లాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు సాంబయ్య, చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామానికి చెందిన కౌలు రైతు ఆలపాటి సాంబశివరావు తెలిపారు. వరి (మిగతా 2లో)



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, ఎంపి చిన్ని

వందేళ్ల అవసరాలకు తగ్గట్లుగా వసతులు

- యాత్రికుల కోసం నిరీక్షణ గదులు
- 'ప్రసాదం పథకం' ద్వారా దుర్గగుడి అభివృద్ధి
- మాస్లర్‌ప్లాన్‌పై మంత్రి ఆనం, ఎంపి చిన్ని సమీక్ష

ప్రజాశక్తి-వన్‌టౌన్

రాబోయే వందేళ్లకు యాత్రికుల అవసరాలను పరిగణనలోని తీసుకుని మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా దుర్గగుడి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దుర్గగుడి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై ఎంపి కేశినేని చిన్ని, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి ఇఒ కెఎస్ రామారావులతో కలిసి మంత్రి ఆదివారం సమీక్ష నిర్వహించారు. ముందుగా దేవస్థానం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు తెలిపారు. అనంతరం దేవాదాయ, పర్యాటక, ఆలయ అధికారులుతో మాస్టర్ ప్లాన్, కేంద్ర ప్రభుత్వ 'ప్రసాదం పథకం' గురించి మంత్రి, ఎంపి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ గతంలో మాస్టర్ ప్లాన్ తయారీకి కొంత పని జరిగి, మధ్యలో అనుకోకుండా ఆగిపోవడంతో (మిగతా 2లో)

గిరిజనులందరికీ సంక్షేమ ఫలాలు

- గృహ మరమ్మతులకు ఆర్థిక సాయం
- త్వరలో అటవీ భూముల సాగుదారులకు హక్కుపట్టాలు
- కృష్ణాజిల్లా గిరిజన సంక్షేమ సాధికార అధికారి ఫణిదూర్జటి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి





ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన గిరిజనులందరికి అందించేందుకు కృషి చేస్తున్నట్లు కృష్ణాజిల్లా గిరిజన సంక్షేమ సాధికార అధికారి ముదిగొండ ఫణిదూర్జటి తెలిపారు. దీనిలో భాగంగానే ఆధార్ కార్డు లేనివారికి ఆధార్ అందించడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. గృహ మరమ్మతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. అటవీ భూముల సాగు హక్కు పత్రాలు ఇవ్వడానికి నివేదికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలో గిరిజనులకు అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫణి దూర్జటి వివరించారు.

ప్రశ్న: గిరిజనులందరికి సంక్షేమ పథకాల అందించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: కృష్ణాజిల్లాలో 37 వేల మంది గిరిజనులున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వందల గిరిజన కుటుంబాల్లో ఆధార్ కార్డులు లేవు. ఆధార్ లేని వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ప్రత్యేక ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మచిలీపట్నం నగరపాలక సంస్థలో ముస్తాఖాన్‌పేట గిరిజన ఆవాసాల్లో 42 మందిని గుర్తించాం. ఇతర ప్రాంతాల్లో 250 మందికిపైగా గిరిజనులకు ఆధార్ లేదు, జిల్లాలో గిరిజనులందరికి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆధార్ కార్డు, ఎన్‌టిఆర్ వైద్యసేవ కార్డులతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: గిరిజనుల విద్యాభివృద్ధికి ఎటువంటి పథకాలు అందిస్తున్నారు?

జవాబు: ఉయ్యూరు గిరిజన గురుకుల పాఠశాలలో 220 సీట్లున్నాయి. దీనిలో 110 మంది విద్యార్థులు చదువుతున్నారు. గురుకులంలో మరమ్మతులకు, అదనపు సౌకర్యాల కల్పనకు కలెక్టర్ (మిగతా 2లో)

ఎన్‌హెచ్ 216 ఆరు వరుసల విస్తరణకు ప్రణాళికలు

... వార్త 2లో

వరద సాయం అర్జీల విచారణలో బాధ్యతారాహిత్యంపై

తహసీల్దార్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరద ప్రభావిత ప్రజలకు ఆర్థిక సహకారానికి సంబంధించి అర్జీల విచారణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో విజయవాడ నార్త్ తహసీల్దార్ ఎం.సూర్యారావుపై చర్యలకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆదేశాలిచ్చారు. బుడమేరు వరదలతో ముంపు ప్రభావానికి గురయ్యామని, తమకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందలేదంటూ విజయవాడ నార్త్ మండల పరిధిలోని దాదాపు 500 మంది ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అర్జీలు సమర్పించారు. వీటిపై సరిగ్గా విచారించకుండా, దరఖాస్తు చేసుకున్నవారందరూ ప్రాథమికంగా అర్హులే అంటూ తహసీల్దార్ (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

నేలకొరిగిన వరి

పైరు నేలకొరగడంతో కూలి రేట్లు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కృష్ణాలో 8.8 మిల్లీమీటర్ల వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగాల్ తుపాను తీరం దాటినా దాని ప్రభావం చూపుతోంది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా వర్షపు జల్లులు పడుతున్నాయి. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 8.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బంటుమిల్లి మండలంలో 30.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవ్వగా, పామర్రులో 13.6, ఉయ్యూరులో 12.2, కోడూరులో 11.6, అవనిగడ్డలో 10.8, పమిడిముక్కలలో 10.4, కృత్తివెన్నులో 10.2, గుడివాడలో 9.2, మచిలీపట్నంలో 9.2, పెదపారుపూడిలో 9.0, గుడ్లవల్లేరులో 8.4, పెడన 8.4, పెనమలూరు 8.4, మోపిదేవి 8.2, నాగాయలంక 8.2, మొవ్వ 8.2, గూడూరు 7.8, కంకిపాడు 7.2, చల్లపల్లి 6.4, ఘంటసాల 6.4, తోట్లవల్లూరు 5.8, బాపులపాడు 3.8, గన్నవరం 2.4, ఉంగుటూరు 2.2, నందివాడ 1.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వందేళ్ల అవసరాలకు తగ్గట్లుగా వసతులు

దానిని మళ్లీ పరిశీలించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉపయోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి 'ప్రసాదం పథకం' ద్వారా టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేస్తూ నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా క్యూ లైన్‌లు, అందులో వెయిటింగ్ రూమ్‌లు, కాటేజీల వసతి ఏర్పాటు చేసి యాత్రికులు సులభంగా అమ్మవారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. జనవరి చివరి నాటికి సమగ్ర ప్రణాళిక రూపకల్పన చేసి తదుపరి స్థానిక ప్రజాప్రతినిధులతో, ముఖ్యమంత్రితో సమీక్షించి పూర్తి స్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపి చిన్ని మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న యాత్రికుల రద్దీ దృష్ట్యా రాబోయే వంద సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా ఏ విధంగా అభివృద్ధి చేయాలి, కేంద్రం నుండి నిధులు తదితర అంశాలపై చర్చించామన్నారు. సిఎం సమీక్ష అనంతరం ఆయన సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు పొంది ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా 2025 సంవత్సరపు ఆలయ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఆలయ ఈఈలు కెవిఎస్ కోటేశ్వరరావు, టి.వైకుంఠరావు, టెక్నికల్ కమిటీ మెంబర్ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులందరికీ సంక్షేమ ఫలాలు

డి.కె.బాలజీ ప్రత్యేకంగా రూ.15 లక్షలు నిధులు కేటాయించారు. త్వరలోనే అభివృద్ధి పనులు నిర్వహిస్తాం. 470 మంది పోస్టు మెట్రిక్ విద్యార్థులకు ప్రభుత్వం త్వరలోనే స్కాలర్‌షిప్‌లు విడుదల చేస్తోంది.

ప్రశ్న: అటవీభూమి హక్కుపత్రాలు ఎందరికి ఇస్తున్నారు?

జవాబు: 2005కు ముందు నుంచి అటవీభూములు సాగు చేస్తున్న గిరిజనులకు సాగు హక్కుపత్రాలు ఇవ్వాలి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బాపులపాడు మండలం మడిచర్లలో 18 మంది గిరిజన కుటుంబాలకు 18 ఎకరాల అటవీ భూమి సాగు చేసుకుంటున్నట్లు గుర్తించాం. అటవీ హక్కు చట్టంలో బాగంగా వీరందరికి త్వరలో సాగు హక్కు పట్టాలు ఇస్తాం.

ప్రశ్న: గిరిజనుల్లో ఎందరికి గృహ మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి?

జవాబు: గిరిజనుల గృహాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు అందిస్తోంది. ఒక్కో ఇంటికి రూ.70 వేల వరకు మంజూరు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికి 300 మంది లబ్ధిదారులకు గృహాల మరమ్మతులకు రూ.2 కోట్లకు పైగా నిధులు కేటాయించాం. మరో 300కుపైగా లబ్ధిదారులను గుర్తించాం. త్వరలోనే వీరికి నిధులు కేటాయిస్తాం.

తహశీల్దార్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం

ఎం.సూర్యారావు దరఖాస్తుదారులకు ఎండార్స్‌మెంట్ ద్వారా తెలియజేశారు. అయితే తదుపరి విజయవాడ ఆర్‌డిఒ విచారణలో దరఖాస్తుదారుల్లో కొందరు మాత్రమే అర్హులని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో అర్హుల నిర్ధారణ విషయంలో సందిగ్ధ పరిస్థితులకు కారణమైన తహసీల్దార్ సూర్యారావుపై ఏపీ సీఎస్ (సీసీఅండ్‌ఏ) రూల్స్, 1991 కింద శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. తుది విచారణ ఆధారంగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఎన్‌హెచ్ 216 ఆరు వరుసల విస్తరణకు ప్రణాళికలు

సమగ్ర నివేదిక తయారీకి ఎన్‌హెచ్‌ఎఐ టెండర్లు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 216) ఆరు వరుసల విస్తరణ సమగ్ర నివేదిక (డిపిఆర్) జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) సన్నాహాలు చేస్తోంది. మూడేళ్ల క్రితం ఈ రహదారిని రెండు వరుసలకు విస్తరించారు. తాజాగా ఆరువరుసలకు విస్తరించడానికి కన్సల్టెన్సీ ఎంపికకు టెండర్లు ఆహ్వానించింది. తొలిదశలో కత్తిపూడి వద్ద ఎన్‌హెచ్ 16కు, మచిలీపట్నం వద్ద ఎన్‌హెచ్ 65కు అనుసంధానంగా 229 కిలో మీటర్లు రహదారిని విస్తరించడానికి ఈ నివేదిక రూపొందిస్తోంది. రెండో దశలో మచిలీపట్నం-ఒంగోలు మధ్య విస్తరణకు నివేదికలు రూపొందిస్తారు. సముద్రతీరంలోని కాకినాడ, మచిలీపట్నం పోర్టులకు సరుకు రవాణాకు అనుగుణంగా ఈ రహదారి విస్తరణ చేపట్టడానికి డిపిఆర్‌ను ఎన్‌హెచ్‌ఎఐ సిద్ధం చేస్తోంది. భూ సేకరణ, రవాణా వాహనాల సంఖ్య, టోల్ వసూళ్ల ద్వారా సమకూరే ఆదాయం తదితరాలపై సర్వే నిర్వహించి ఏజెన్సీ డిపిఆర్ తయారు చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఒంగోలు - కత్తిపూడి మధ్య విస్తరించి ఉంది. ఒంగోలు వద్ద, కత్తిపూడి వద్ద చెన్నై-కలకత్తా జాతీయరహదారి 16కు అనుసంధానం అవుతుంది. మచిలీపట్నం వద్ద (ఎన్‌హెచ్ 65)కు అనుసంధానం అవ్వడం వలన రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డుకు కనెక్టు అవుతుంది. ఎన్‌హెచ్ 216కు పెడన వద్ద కలుస్తుంది. పెడన, హనుమాన్‌జంక్షన్, నూజివీడు మీదుగా తెలంగాణాలోని ఖమ్మం జిల్లాకు వెళ్లే అవకాశం ఉంది. ఈ రోడ్డును విస్తరించడానికి గతంలో ప్రణాళికలు రూపొందించారు.

48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ

తుపాను నేపథ్యంలో ధాన్యం రైతులకు మంత్రి భరోసా

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రతికూల వాతావరణం కారణంగా నిరాశ చెందుతున్న రైతులతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం సమావేశమయ్యారు. స్థానిక ఐతానగర్, లింగరావు సెంటర్లో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు, వాతావరణం ప్రతికూల పరిస్థితులపై రైతులకు ధైర్యాన్ని నింపారు. రైతులకు అందుతున్న సహాయక చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తూపాను హెచ్చరికలు, వాతావరణంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు తమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతులుపట్ల చిత్తశుద్ధితో ఉందన్నారు. పండించిన పంటను జిల్లాలో ఎక్కడైనా విక్రయించే విధంగా వసతులు కల్పించామన్నారు. పంట విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నుల పైచేలుకు కొనుగోళ్ళపై నగదు చెల్లింపు జరిగిందన్నారు. 25శాతం తేమకలిగిన వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రైతులను ఇబ్బంది పెట్టిన మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ అందేల అన్నివిధాల ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో ఏడిఏ ఎన్ ఉషారాణి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు, కన్నెగంటి మురళి కృష్ణ, ఈదర పూర్ణ చంద్, మేకల చిట్టిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

64వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన



ప్రజాశక్తి-విజయవాడ: తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కండ్రిక, సాంబమూర్తి రోడ్డు, భగత్‌సింగ్ రోడ్డు, జిఎస్‌రాజు రోడ్డు, పాతపాడు, నూజివీడు రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజాసమస్యలను కమిషనర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 64వ డివిజన్‌లో పేరుకుపోయిన మంచినీటి సమస్య, పారిశుధ్యం, పార్కుల అభివృద్ధి, డ్రెయినేజి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 64వ డివిజన్లో నివసిస్తున్న ప్రజలకు సదుపాయాలన్నీ కల్పించాలని కోరారు. తాగునీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా శుద్ధమైన త్రాగునీటి సరఫరా చేయాలని కోరారు. ప్రతిరోజూ త్రాగునీటి నమూనాలను పరీక్షిస్తున్నప్పటికీ పూర్తి నిర్ధారణ ఖచ్చితంగా చేసుకోవాలని కోరారు. త్రాగునీటి పైపులైనులు డ్రైనులో కలవకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన అభివద్ధి కార్యక్రమాల ప్రణాళికలను పూర్తి చేసి తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాలలో పార్కులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. పాయికాపురం చెరువును అభివద్ధి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెంట్ ఇంజనీర్ వర్క్స్ పి సత్యనారాయణ, ఇన్చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వసతి గృహాల్లో

యుద్ధప్రాతిపదికన నీటి సరఫరా పనులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని శాతవాహన, గౌతమి, అశోక, అమరావతి, స్కాలర్స్, ఇంజనీరింగ్ కళాశాల, స్పోర్ట్స్ హాస్టల్స్, లేడీస్ హాస్టల్‌లలో యుద్ధ ప్రాతిపదికన వాటర్ సప్లై పనులు జరిగాయి. దీనిలో భాగంగా అన్ని వసతి గృహాలపై ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్ పరిశుభ్రపరిచారు. వర్సిటీ వాటర్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజనీర్ డి సతీష్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది పనులు పూర్తి చేశారు. బాలుర వసతి గృహాల డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ కే శశిధర్, డాక్టర్ నంబూరు బాబు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెనుమాకలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడ లక్ష్మీ ఫౌండేషన్, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కల్లం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పెనుమాక ఎలిమెంటరీ పాఠశాలలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 165 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణి, ఇమ్రాన్, సిబ్బంది గురవయ్య, రజియా పాల్గొన్నారు.




హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- ఈవీఎంల పనితీరుపై అనుమానాలు
- ఎమ్మెల్సీ హనుమంతరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికలలో ఈవీఎంలపై అనేక పార్టీలు అనుమానం వ్యక్తం చేశాయని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. ఆదివారం మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన దుగ్గిరాల మండల వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు సక్రమంగా జరగాలన్నారు. ఈవీఎంలపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బ్యాలెట్ ద్వారా ఎన్నికల నిర్వహించాలని దేశంలో అనేక పార్టీలు కోరుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. ఈ ప్రభుత్వంపై అప్పుడే ప్రజావ్యతిరేకత మొదలైందని చెప్పారు. నియోజకవర్గ సమన్వయకర్త డి.వేమారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి : ఎంఎల్ఎ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి రమేష్ బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోనమి, అవసరమైతే తగ్గిస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే మాట తప్పి ప్రజలపై రూ 15,485 కోట్ల రూపాయల బారం మోపుతున్నారని మాజీ ఎమ్మెల్యే వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింహాద్రి రమేష్ బాబు తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మాటలు తప్ప చేసింది ఏమీ లేదని ఇచ్చిన వాగ్దానాలన్నీ ఏ ఒక్కటి నెరవేర్చలేకపోయారని దుయ్యబట్టారు. నియోజక వర్గంలో మంజూరైన పనులకు సంబంధించి కూడా ఏ ఒక్కటి ప్రారంభించలేదన్నారు. ఏటి మొగ ఎదురు మండి బ్రిడ్జి గాని అదేవిధంగా అవనిగడ్డలోని డంపు యార్డ్‌కి సంబంధించి నిధులు మంజూరైనా దానిని తరలించనివ్వకుండా అడ్డుకున్నారని వారు వచ్చినా కూడా దానిని పరిష్కారం చేయలేకపోయారన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కషి చేయకపోగా ఆయన కనుసన్నలోనే ఇసుక, బుసక, బియ్యం అక్రమ దందా సాగుతుందన్నారు. నియోజకవర్గం కోడిపందాలకు జూదాలకు నిలయంగా మారిందన్నారు. బుద్ధప్రసాద్ కుటుంబ సభ్యుల కనుసనల్లోనే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకపోగా ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు. ప్రకతి వైపరీత్యాల వల్ల గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు యంత్రాల సహాయంతో కోసిన ధాన్యాన్ని వెంటనే నిబంధనలను సడలించి దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీ నుండి రైతులను రక్షించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : మిల్లర్ల దోపిడీని అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దివి సీమ ప్రాంతంలో ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని ఏపీ రైతు సంఘం నేతల బందం ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్ స్థానిక మండల పరిధిలోని వక్కలగడ్డలో మాట్లాడుతూ రైతుల కష్టాన్ని ఆసరాగా చేసుకుని మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకునేందుకు రైతులకు కనీసం టార్పాలిన్లు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ రామారావు, రైతు సంఘం నాయకులు మల్లిపెద్ది బోసు, మాలెంపాటి కోటేశ్వరరావు, నక్క శ్రీను కొల్లూరి శ్రీధర్, దాసరి గోపాలకష్ణ, సాయి బాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గన్నవరం : జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సవాల నడుమ ఆదివారం జరిగింది. ఈ సభకు వేములపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సభలో స్థల దాతలు శ్రీయుతులు దోనవల్లి రామారావు చేతులు మీదిగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు.


శ్రమదానం చేస్తున్న వాలంటీర్లు

రెడ్‌వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పంచాయతీ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో రెడ్ వాలంటీర్లు చేపట్టిన శ్రమదానం ఆదివారం కొనసాగింది. డ్రైనేజీలో పూడిక తీయడంతో పాటు చెత్తాచెదారం తొలగించారు. ప్లాస్టిక్ బాటిళ్ల ను ఏరి శుభ్రం చేశారు. ప్రతి ఆదివారం శ్రమదానం ద్వారా పరిసరాలను శుభ్రం చేస్తామని కన్వీనర్ నాగ బ్రహ్మచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఆదివాం గుడివాడ పట్టణంలో సుందరయ్య భవనంలో జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి ఎల్ సురేంద్ర మాట్లాడుతూ గురజాడ జీవితంలో అనుభవాలను కన్యాశుల్కం నాటిక ప్రదర్శన, దేశమును ప్రేమించమన్న గేయాన్ని జాతీయ గీతంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గేయాన్ని ఎ వెంకటేశ్వర రావు ఆలపించారు. ఈ కార్య క్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజని, సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు, ఏ.విజయకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సంధర్భంగా శ్రీ అమ్మవారిని అధిక సంఖ్యలో యాత్రికులు దర్శనం చేసుకున్నారు. సుమారు 4 వేల మంది యాత్రికులు దర్శనం చేసుకుని అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు మరియు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న యాత్రికులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ట్రస్టు కొన్ని సంవత్సరాలుగా నెలలో ప్రతి మొదటి ఆదివారం ఉచితంగా బీపీ, షుగర్ మొదలగు వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మందులు అందిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

విజేతలకు బహుమతులు అందజేత



ప్రజాశక్తి - పమిడిముక్కల : ప్రముఖ గాయకుడు ఘంట సాల వెంకటేశ్వరరావు ఎన్నో గీతాలు ఆలపించి తెలుగు జాతిని మేల్కొల్పిన మహా గొప్ప వ్యక్తి అనిపామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం పమిడి ముక్కల మండలం లోని మం టాడ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంగీత పోటీలలో 102 మంది పాల్గొని పాటలు ఆలపించారు. ఘంటసాల కళాపీఠం అధ్యక్షులు కాటూరు వెంకట మురళీకష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలను ఆలపించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ, టిడిపి నాయకులు జక్క శ్రీనివాసరావు, ఉయ్యూరు నగర చైర్మన్ వల్లభనేని వంశీ పాల్గొన్నారు.

ప్రతి ఏటా ఉత్తమ విద్యార్థినికి మొటపర్తి రామచంద్రమ్మ అవార్డు


రామచంద్రమ్మ

ప్రజాశక్తి-గన్నవరం : ఐఐఎంవీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్) విశాఖపట్నంలో ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ ఎంబీఏ విభాగంలో ఉత్తమ విద్యార్థినికి ప్రతి ఏటా మొటపర్తి రామచంద్రమ్మ అవార్డు ప్రదానం చేయడానికి రూ. 5.25 లక్షలు నిధి సమకూరినట్లు వికేఆర్ కళాశాల అధ్యక్షులు వెంకట్ మొటపర్తి ఆదివారం వెల్లడించారు. మహిళలను విద్యా, వ్యాపార రంగంలో ప్రోత్సహించడానికి ఉత్తమ మహిళా విద్యార్థినికి అవార్డు ప్రదానం చేస్తామన్నారు. విద్యావేత్త మొటపర్తి రామచంద్రమ్మ పేరిట ప్రతి ఏటా ఈ అవార్డు అందించేందుకు వీలుగా ఐఐఎం విశ్వవిద్యాలయానికి రూ.5.25 లక్షలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశామన్నారు. తద్వారా వచ్చే ఆదాయంపై వడ్డీ తో ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన విద్యార్థినికి మెరిట్ సర్టిఫికెట్, నగదు అందజేస్తామన్నారు. ఈ మేరకు ఐఐఎం డైరెక్టర్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. మహిళా విద్యార్థులను ఉన్నత చదువుల్లో ప్రోత్సహించడానికి ఎప్పుడూ తాము ముందుంటా మన్నారు. రామచంద్రమ్మ అవార్డు ప్రకటించడం పట్ల వి.కే ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎం వి ఎల్ ప్రసాద్, కార్యదర్శి మురళీకష్ణ అభినందనలు తెలిపారు. ప్రసాద్ చెబుతూ చదువు విలువ తెలిసిన మహోన్నత వ్యక్తి రామచంద్రమ్మ అని కొనియాడారు. గన్నవరం ప్రాంతంలో వికేఆర్ కళాశాల ఏర్పా టులో ఆమె కీలకపాత్ర పోషించడం వల్లే ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకుని దేశ విదేశాల్లో స్థిరపడినట్లు వివరించారు.


డ్రైవర్‌ను పరామర్శిస్తున్న గౌతమ్

ఆర్‌టిసి డ్రైవరుకు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆర్టీసీ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడి విజయవాడ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న డ్రైవర్ మహేష్ బాబును వైసీపీ అభిమాని బడే గౌతమ్ పరామర్శించారు. ఆసుపత్రి వద్దకు వెళ్లి మహేష్ బాబును వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి ఇలాంటి వాటికి పాల్పడవద్దని చెప్పారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న డ్రైవర్ మహేష్ బాబుకు ధైర్యం చెప్పి ఆ కుటుంబానికి ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అండగా నిలవాలని గౌతమ్ కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కంకిపాడు : యనమలకుదురులోని లంబాడి పేట కట్ట వెంబడి ఉన్న అవనిగడ్డ కాలువలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు, వీఆర్వో ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసినట్లు పెనమలూరు పోలీసులు తెలిపారు. మతదేహం బాగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని, మృతుని వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటాయన్నారు. మృతుడు నీలిరంగు, పసుపురంగు టీషర్టు ఉందన్నారు. మతదేహం ను శవపరీక్షకై ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిస్తే సిఐ ఫోన్ నెంబర్ 9490619468, లేదా ఎస్ఐ ఫోన్ నెంబర్‌కు 8686135007కు తెలియజేయాలన్నారు.



శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న కార్పొరేటర్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ ఇంద్రకీలాద్రి కొత్తపేట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షులు సురకాసి శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు కార్తీక మాసం ఆఖరి రోజు స్వామివారి అన్నాభిషేక, పూజా కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. స్వామివారిని జనసేన 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు, జనసేన 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, టిడిపి 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), జనసేన 52వ డివిజన్ అధ్యక్షులు ఎన్.కనకారావు, జనసేన విజయవాడ నగర అధికార ప్రతినిధి ముద్దాన స్టాలిన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు కోలా విజయ్ శేఖర్

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - భవానీపురం : లయన్స్ క్లబ్ విజయవాడ మెడికల్, శ్రీ ముకుంద ఫార్మా స్యూటికల్స్ అధినేత పి.హరినాథ ప్రసాద్ సహకారంతో ఆదివారం విద్యాధరపురం సిమెంట్ రోడ్డులోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ విజయవాడ మెడిక అధ్యక్షులు పి.వేణుగోపాలరావు, కార్యదర్శి పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ, బెజవాడ రాజారావు హైస్కూల్ కరెస్పాండెంట్ బెజవాడ రాజారావు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు కోలా విజయ్ శేఖర్, ఎముకల, కీళ్ళ వ్యాధి వైద్య నిపుణులు కుందా శ్రీధర్, షుగర్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ ఐ.సందీప్ కుమార్, ప్రముఖ దంత వైద్య నిపుణులు సంతోష్ యండలు పాల్గొని వైద్య శిబిరంలో సేవలు అందించారు. కావాల్సిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నూతన క్యాలెండర్ 2025ను క్లబ్ గవర్నర్ గద్దె శేషగిరి, ఎన్‌వివిఎస్ ప్రసాద్, సిహెచ్.శ్రీనివాస రెడ్డి, వైద్యులు పాల్గొని ప్రారంభించారు. అనంతరం బెజవాడ రాజారావును లయన్స్ క్లబ్ తరఫున సన్మానించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి తమ పాఠశాల వేదిక కావటం చాలా ఆనందంగా ఉందని కరెస్పాండెంట్ బెజవాడ రాజారావు తెలిపారు.

రాంగోపాల్ వర్మపై బుద్ధా మండిపాటు

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

కూటమి నేతలపై గతంలో ఇష్టంవచ్చినట్లు వాగిన సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ భయపడి పారిపోయాడని వర్మపై మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఫైర్ అయ్యారు. ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతు వర్మ గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లను కించపరిచేలా సినిమాలు తీశాడని, తన ట్విట్టర్లో మార్ఫింగ్ ఫొటోలు పెట్టి పైశాచిక ఆనందం పొందాడని, ఇప్పుడు కేసులకు భయపడి అడ్రస్ లేకుండా దాక్కున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కామా దేవరాజు, చిన్న సుబ్బయ్య, కొప్పల గంగాధరరెడ్డి, పత్తి నాగేశ్వరరావు, నందం భవానీప్రసాద్, కొనికి కొండయ్య, సురభి బాలు, ఈగల సాంబశివరావు, అమరా మురళీకృష్ణ, ఇంకా పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల దందా

చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ, చందర్లపాడు మండలాల్లో మద్యం వ్యాపారం బెల్టు షాపుల దందా ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. కిరాణాలోని నిత్యావసర సరుకుల మాదిరిగా మద్యం అమ్మకాలను సాగిస్తున్నారు. అధికారులు మాత్రం బెల్టుషాపుల నిర్వహణపై ఉక్కుపాదం మోపుతామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఐదు వరకు మద్యం బెల్టు దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈ విషయం ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులకు తెలిసినా పట్టీ పట్టనట్లు ఉంటున్నారు. నామమాత్రంగా అప్పుడప్పుడు దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. వైన్ షాపుల్లో ఎమ్మార్పీ రేట్లకు మద్యం అమ్ముతున్నప్పటికీ షాపులు దక్కించుకునేందుకు పోటీపడి టెండర్లలో అధిక మొత్తానికి కైవసం చేసుకున్న వ్యాపారులు సిండికేట్‌నే నడిపిస్తున్నారు. మద్యం ప్రియులను నిలువునా దోపిడీ చేసేందుకు వైన్ షాప్ నిర్వాహకులు బెల్ట్ షాపులకు మందు విక్రయించేందుకే ఆసక్తి చూపుతున్నారు. కస్టమర్స్‌కు నేరుగా అమ్మితే ఎమ్మార్పీ రేటుకే ఇవ్వాల్సి వస్తుందని, అదే బెల్ట్ షాప్‌కు అమ్మితే ఎంఆర్‌పికి మించి అమ్మొచ్చనే ఉద్దేశంతో వైన్ షాప్ నిర్వాహకులు ఈ విధంగా పాల్పడుతున్నారని కొందరు విమర్శిస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలోని మండలంలో మద్యం సోడా బండ్లు దగ్గర, అమ్మకాలకు ముఖ్యంగా గ్రామాల్లో కొన్నిచోట్ల ఇళ్లలోనే మద్యం అమ్ముతుండగా మరికొన్ని చోట్ల కిరాణా షాపులు, చికెన్ సెంటర్ల చాటున మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బహిరంగంగానే విక్రయాలు సాగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే షాపుల్లో మద్యం లభిస్తుందంటే ఏ మేరకు బెల్ట్? షాపులు నడుస్తున్నాయనేది అర్థం చేసుకోవచ్చు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం పుష్కలంగా లభిస్తున్నా వాటివైపు కన్నెత్తి చూసి పట్టించుకునే వారే లేకుండా పోయారు. నియోజకవర్గంలోని గ్రామాల్లోని వైన్ షాపుల నుంచి నిత్యం గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఇకపోతే బెల్టు షాపుల యజమానులు ఒక్కో బీరు, విస్కీ, క్వార్టర్ సీసాల మీద రూ.20 నుంచి రూ.50ల వరకు ధరలను పెంచి ఇష్టారాజ్యంగా అమ్మకాలు సాగిస్తున్నారు. కిరాణా షాపుల్లో చిల్లర వస్తువుల్లా మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మద్యాన్ని విక్రయిస్తున్నా.. వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రమత్తు వీడి గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు దుకాణాలను మూసివేయించాలని నియోజకవర్గంలోని ప్రజలు కోరుతున్నారు.



యాదవ సంఘం వన సమారాధన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : యాదవ సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని బలుసుపాడు రోడ్డులో గల మామిడి తోటలో యాదవుల కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్మికులకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, అక్షర ఫౌండేషన్ అధినేత జంగాల రవీంద్ర యాదవ్, యాదవ రాష్ట్ర అధ్యక్షులు లాక వెంగళరావు యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొలుసు పార్థసారథిని గజమాలతో సత్కరించారు. అనంతరం సారధి చేతుల మీదగా వన భోజనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా అత్యధికగా యాదవ్ యువత పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పచ్చిపాల నాగేశ్వరరావు యాదవ్, నియోజవర్గ అధ్యక్షులు తాడి బోయిన ప్రసాద్ గారు, పట్టణ అధ్యక్షులు మేకల సాంబశివరావు యాదవ్, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు రాసబంటి సత్య శేఖర్, కౌన్సిలర్ వడ్డెర గోట్టే నాగరాజు, న్యాయవాది ఆంజనేయులు, గుమ్మా చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.



వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి పార్థ సారధి


అన్నదానం కార్యక్రమంలో రాంపిళ్ల జయప్రకాష్

అన్న ప్రసాద వితరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కార్తీక మాసం ముగింపు సందర్భంగా శ్రీ దర్భేశ్వరస్వామివారి దేవస్థానంలో 2వేల మంది యాత్రికులకు అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త రాంపిళ్ల జయప్రకాష్ చెప్పారు. ఆదివారం కొత్తపేట సైకంవారివీధిలో ఉన్న శ్రీదర్భేశ్వరస్వామి దేవస్థానం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని దేవీ ఉపాసకులు అజిత్ సింగ్ (ప్రిన్స్) లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీకమాసం ముగింపు రోజున వేలాదిమంది యాత్రికులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నట్లు చెప్పారు. యాత్రికులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు మురళి, అర్చకులు చంద్రశేఖర్, యాత్రికులు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై వైపిపి పోరాటం

జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అనేక అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 6 నెలల కాలంలోనే ప్రజలపై భారాలు మోపుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఆ విధానాలపై వైఎస్‌ఆర్‌సిపి అలుపెరగని పోరాటం చేస్తుందని వైఎస్‌ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణు, మొండితోక జగన్ మోహన్ రావు అన్నారు. పట్టణంలోని వైయస్సార్ సిపి కార్యాలయాన్ని ఆదివారం రాత్రి వైసిపి నాయకులు ప్రారంభించారు. అంతకుముందు చిల్లకల్లు నుండి జగ్గయ్యపేట పట్టణం వరకు వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్‌ఆర్‌సిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో వారు మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెటీ అంటూ అబద్దాలతో అధికారంలోకి వచ్చి నేడు ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రానున్న కాలంలో జగ్గయ్యపేటలో వైఎస్‌ఆర్‌సిపి జెండా ఎగరవేయాలని కార్యకర్తలను కోరారు. రానున్న కాలంలో సంక్రాంతి తర్వాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ సభలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేల్పుల రవికుమార్, ఇంటూరి చిన్న, రవి, హాఫిఉన్నిసా బేగం, వట్టెం మనోహర్, గాంధీ, బద్దు నాయక్, బూడిద నరసింహారావు, సంపత్ విజిత, సుశీల పాల్గొన్నారు.



కూటమి అసమర్థ పాలనకు డిఆర్‌సి సమావేశమే నిదర్శనం : విష్ణు

ప్రజాశక్తి - విజయవాడ : కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సమీక్ష సమావేశంలో టిడిపి ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలే నిదర్శనమని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రజల నుంచి నానాటికి వ్యతిరేకత పెరుగుతుండటంతో.. 6 నెలల కాలంలోనే చివరికి ఎమ్మెల్యేలు సైతం ప్రశ్నించే పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా విజయవాడ నగరాన్ని వరదలు ముంచెత్తి 3 నెలలు గడిచినా బాధితులకు నేటికీ పూర్తిగా న్యాయం జరగలేదని ఆరోపించారు. వరదల కారణంగా నష్టపోయిన సామాన్య ప్రజలు, ఆటో కార్మికులు, చిరు వ్యాపారులకు న్యాయం జరగలేదని మొదటి నుంచి వైసీపీ చెబుతూనే ఉందని కానీ రాజకీయ విమర్శలుగా కొట్టి పారేశారని మండిపడ్డారు. విఎంసి కౌన్సిల్ సమావేశంలోనూ టిడిపి కార్పొరేటర్లు అడ్డగోలుగా వాదించారని.. కానీ ఇప్పుడు డీఆర్సీ సమావేశంలో సాక్షాత్తు టీడీపీ ప్రజాప్రతినిధులే ఒప్పుకున్న పరిస్థితి నెలకొందని అన్నారు. కూటమి సర్కారుకి ప్రజలపై 1 శాతం ఎస్‌జిఎస్‌టి భారం వేయటంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంలో లేదని దుయ్యబట్టారు. మరోవైపు రైతు బజార్లన్నీ అవినీతి కంపు కొడుతున్నాయని దుయ్యబట్టారు. సిండికేట్లు తనకే డబ్బు ఇవ్వటానికి వస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పటం ఈ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని అంగీకరించటమేనని అభిప్రాయపడ్డారు.

పసుపు కొమ్ములతో అలంకరణ

ప్రజాశక్తి - వత్సవాయి : పసుపు కొమ్ములతో అలంకారం, పెనుగంచిప్రోలు మండలంలోని పెనుగంచిప్రోలు గ్రామంలో బాపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి ఆదివారం పసుపు కొమ్ములతో అలంకారం చేపట్టారు. శనివారమే పసుపు కొమ్ములను దండలుగా తయారు చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన ఎస్‌జిఎస్ కళాశాల సెక్రటరీ కల్యకుంట్ల సాయిబాబా, వేముల నాగేశ్వరరావు దశదిన కార్యక్రమంలో ఆదివారం జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'దీపం'పై మహిళల కన్నెర్ర

• గ్యాస్ సొమ్ము జమకావడంలేదని ఆవేదన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : దీపం పథకంపై మహిళలు కన్నెర్రజేసి వ్యతిరేకిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ పొందిన 48 గంటల తర్వాత కూడా రక రకాల సాకులతో అర్హుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ కాకపోవటంతో అర్హులు ఆందోళనకు లోనవుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తప్పుంచుకుని మొండి చేయి చూపేందుకే గతంలో వలె అర్హులకు మేలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం మోకాలు అడ్డుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయని ఆరోపిస్తున్నారు. గుడ్లవల్లేరు మండలంలో ఇండియన్, హెచ్పీ, భారత్ గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి 13వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్లలో అర్హులైన వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సొమ్ము చెల్లించి తీసుక ఎన్నా...బ్యాంకు ఖాతాల్లోకి ఎన్ని రోజులైనా చాలామంది అర్హులకు ప్రభుత్వం సొమ్ము జమ చేయటం లేదన్న ఆరోపణలు గృహిణుల నుంచి వెలువెత్తుతున్నాయి.

చంద్రబాబు ఎన్నికల హామీ ఇలా...

ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చేటపుడు కేవలం తెల్ల రేషను కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీలో 48గంటల్లో లబ్ది చేకూరుస్తానని ఎక్కడా ఆయన ప్రస్తావించలేదు. ఎన్నికల హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత గ్యాస్ పంపిణీపై కొత్త నిబంధనలు పెడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ 48గంటలు అనే మాట ఇపుడే చెప్పటం తప్ప... గతంలో చెప్పలేదు. ముందుగా డబ్బు చెల్లించమనేది



కూడా కొత్త నిబంధనే. అయితే 10 రోజులైనా గ్యాస్ పొందిన అర్హులకు బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కావటం లేదు. ఇదేమిటని అడిగితే ఫోను నంబర్లు మార్చుకోవాలని, ఈకేవైసీలు చేయించుకోవాలన్న రకరకాల సాకులు చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

దీపావళికి గ్యాస్ తీసుకున్నా..
ఇంతవరకు డబ్బులు పడలేదు
-ఎన్.సుందరమ్మ, గుడ్లవల్లేరు



దీపావళికి గ్యాస్‌కి డబ్బులు కట్టి సిలిండర్ తీసుకున్నాను. నేను కట్టిన డబ్బులు వెంటనే నా బ్యాంకు ఖాతాలో పడతాయని అధికారులు చెప్పారు. కాని ఆ పండుగ రోజు నుంచి ఈరోజు వరకూ ఎదురు చూస్తున్నాను. ఇప్పటి వరకూ నా బ్యాంకు ఖాతాలో డబ్బులు పడలేదు.

అన్నీ అబద్ధపు హామీలే...
పిడుగు దేవసహాయం, గుడ్లవల్లేరు
మండల సీపీఎం నాయకుడు



కూటమి ప్రభుత్వం రాక ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అబద్ధపు హామీలే. అందులో ఉచిత గ్యాస్ పంపిణీ ఒకటి. హామీ ఇచ్చిన పుడు గ్యాస్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక...డబ్బు కట్టమన్నారు. డబ్బు కట్టాక 48గంటలు అని చెప్పారు. ఇపుడేమో ఎన్ని రోజులైనా డబ్బులు పడటం లేదు.

ఈకేవైసీ తప్పనిసరి...
కిరణ్, పీడీఎస్ డీటీ

సొమ్ము చెల్లించి... గ్యాస్ సిలిండర్ పొందే వారిలో అర్హులు అందరూ ముందుగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సిందే. అపుడే వారికి గ్యాస్ తీసుకున్న తర్వాత సొమ్ము వారి వారి బ్యాంకు ఖాతాలకు చేరుతుంది. బ్యాంకు అకౌంట్తో పాటు పాన్, ఆధార్ కార లతో సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి కోవాలి. వెళ్లి వేలిముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలి.

సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు

సుబ్బారెడ్డి మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి-తాడేపల్లి : శనివారం గుండెపోటుతో మృతిచెందిన సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి (78) మృతికి పలువురు సంతాపం తెలిపారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మరణం చాలా బాధాకరమని, ప్రజానాట్యమండలి రాష్ట్ర సాంస్కృతిక



కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

గుండెపోటుతో మృతి : ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి రోజులాగానే శనివారం ఉదయాన్నే కృష్ణానదిలో ఈతకు వెళ్లా రు. నదిలోనే ఉన్నట్టుండి గుండెపోటు రావడంతో సహచర ఈతగాళ్ళు వెంటనే ఒడ్డుకు చేర్చి, దగ్గర్లో ఉన్న మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆయన చనిపోయినట్లు ధ్రువీకరించారు.

ఉద్యమం ఉత్తమ నటుడు, ప్రతిభావంతమైన దర్శకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. ఈలోటు పూడ్చలేనిదని, దీర్ఘకాలంగా ప్రజా నాట్యమండలిలో ప్రజా కళాకారుడుగా సేవలు అందించిన సుబ్బారెడ్డికి జోహార్లు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన పలువురు నాయకులు సుబ్బారెడ్డికి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు, సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు డి కాశీనాథ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, డప్పుకళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రాంతికుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న, గుడివాడ సిపిఎం నాయకులు ఎన్ మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక రంగం బాధ్యులు కె.స్వరూపరాణి, యువి రామరాజు, డి వి ఎస్ రాజు, జి నారాయణ, పి విజయ, వై సుబ్బారావు, సిపిఎం గన్నవరం డివిజన్ కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్ రామరాజు, దివి డివిజన్ నాయకులు యద్దనపూడి మధు, శీలం నారాయణరావు, వాకా రామచంద్రరావు, చేబ్రోలు బసవపూర్ణ, బండి ఆదిశేషు, పోలాబత్తిన మోహన్‌రావు, మహమ్మద్ కరీముల్లా తదితరులు సుబ్బారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సుబ్బారెడ్డి మృతదేహాన్ని మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రికి వైద్య పరిశోధనల కోసం కుటుంబ సభ్యులు అప్పగించారు. కళ్లను హైదరాబాదులోని ఎల్విఆర్ కంటి ఆసుపత్రికి అందించారు.

ఘన నివాళి : ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ అధ్యక్షతన శనివారం సాయంత్రం జరిగిన సంతాప సభలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి మధు మాట్లాడుతూ చివరి శ్వాస వరకు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన ధన్యజీవి గాదె సుబ్బారెడ్డి అని ఘనంగా నివాళులర్పించారు. కళారూపాలను తీర్చిదిద్దటంలో సుబ్బారెడ్డి కొత్త వరవడి సృష్టించారని చెప్పారు. సాధారణమైన పేద ప్రజలకు అర్ధమయ్యే రీతిలో కళారూపాలు తయారు చేయడంలో ఆయన దిట్టని కొనియాడారు. ఇటీవల తెలుగు రాష్ట్రంలో ప్రజాకవి సుద్దాల హనుమంతు పేరుతో రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర వారసత్వాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజా పక్షం వహించే సిద్ధాంతం కోసం ప్రజల పక్షాన నికరంగా నిలబడి పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సుబ్బారెడ్డి మృతి మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం, ప్రజానాట్యమండలి, బాలోత్సవ కార్యక్రమాలకు తీరని లోటని తెలిపారు. తన జీవించిన కాలంలో ఎలా జీవించారు అనేది కొలబద్దని, దాన్ని ఆచరణలో చేసి



చూపించిన ప్రజా కళాకారుడు అని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వైవెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ అవసరం ఉంటే అక్కడ పని చేశారని కొనియాడారు. ప్రజా కళలను ఊరువాడ ప్రజల ముంగిట చేర్చడానికి వీధినాటికల ద్వారా ప్రజల్ని చైతన్యపరిచారని చెప్పారు. భార్య శివలీలతో పాటు కుటుంబ సభ్యులందరినీ పార్టీ వైపు నిలబెట్టారని కొనియాడారు. కళారంగాన్ని ఆయన మరో గుండెకాయగా భావించారని చెప్పారు. ఎంబీవికే కార్యదర్శి పి.పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా ఉద్యమంలో 55 ఏళ్ల సుదీర్ఘ అను బంధం తమదని గుర్తు చేసుకున్నారు. కరోనా సమ యంలో కూడా విద్యార్థులకు ఆన్లైన్ పోటీలు నిర్వ హించడం ఆయన దార్శనికతకు నిదర్శనమని చెప్పారు.



నివాళులర్పిస్తున్న దివి డివిజన్ నాయకులు

ముస్తాబవుతున్న అమరవీరుల స్మృతి చిహ్నం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఈనెల 15, 16,17 తేదీల్లో చల్లపల్లిలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కృష్ణాజిల్లా 25వ మహా సభలను విజయవంతంగా జరిపేందుకు పార్టీ కార్యక ర్తలు విస్తృతంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చల్లపల్లి జమిందారుకు వ్యతిరే కంగా పోరాటం చేసి, పోలీసు తుపాకు గుళ్లకు బలైన 41 మంది అమరవీరులకు గుర్తుగా అమర్ నగర్ లో ఏర్పాటుచేసిన అమర వీరులస్మృతి చిహ్నాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సుందరీ కరణ పనులను సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, చల్లపల్లి మోపిదేవి, కోడూరు మండల కార్యదర్శులు యద్దనపూడి మధు, బండి ఆదిశేషు, పోలాబత్తిన మోహన్‌రావు, చల్లపల్లి మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బళ్ల వెంకటేశ్వరరావు, బందారు కోటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు మేడంకి వెంకటేశ్వరరావు తదితరులు ఆదివారం పరిశీలించారు.



స్మృతిచిహ్నం పరిశీలిస్తున్న నాయకులు

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ హాలులో ఉదయం 10:30 గంటల నుండి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.



హంసలదీవిలో పర్యాటకులకు అనుమతి లేదు : సిఐ

ప్రజాశక్తి-కోడూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున హంసలదీవి సముద్ర తీరానికి పర్యాటకులకు ఎవరికి అనుమతి ఇవ్వడం లేదని పాలకాయతిప్ప మెరైన్ సిఐ సురేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం పాలకాయతిప్ప కరకట్ట వద్ద వున్న గేట్లను మూసివేశారు. స్థానిక మెరైన్ , సివిల్ పోలీసులు, ఫారెస్ట్ సిబ్బంది గేటు దగ్గర ఉంటూ ఎవరిని లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రేషన్‌డీలర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-చల్లపల్లి : మండలంలోని నిమ్మగడ్డ గ్రామంలోని 0632028 నంబర్ గల చౌక ధరల దుకాణానికి డీలర్ నియామకం కొరకు అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు చల్లపల్లి ఇన్చార్జి తహశీల్దార్ జి. శ్రీలత తెలియ చేశారు. దరఖాస్తు దారులకు ఈ నెల 31 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20 తేదీన రాత పరీక్ష , 23 తేదీన మౌఖిక పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలు జరుగు స్థలం హాల్ టికెట్‌లో తెలియచేస్తారని చెప్పారు. గంటన్నర పాటు జరిగే ఈ రాత పరీక్ష ను 80 మార్కులకు నిర్వ హిస్తారని ఆమె వివరించారు.

వీడియో వక్తృత్వ పోటీల బహుమతి ప్రదానం

విజయవాడ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నవంబర్ నెలలో విద్యార్థి వికాస వాహిని మా గ్రంథాలయం అనే శీర్షికతో నిర్వహించిన వీడియో వక్తృత్వ పోటీల విజేతలకు ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో బహుమతులు అందజేశారు. ఇతర ప్రాంతాల విద్యార్థులకు నగదు బహుమతులు ప్రశంసా పత్రాలు పోస్టు ద్వారా పంపించారు. విజయవాడ పరిసర ప్రాంత విద్యార్థులకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పర పెద్దల సమక్షంలో ఠాగూర్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణాజిల్లా వాకర్స్ అసోసియేషన్ గవర్నర్, అడిషనల్ గవర్నమెంట్ లీడర్ శ్రీ చిన్నం రామకృష్ణ, ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఇటువంటి పోటీల్లో పాల్గొని వారి మేధాశక్తిని నైపుణ్యతను అభివృద్ధి చేసుకుంటే సమాజానికి మంచి చేసే పౌరులుగా తయారవుతారన్నారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించుచున్న విద్యార్థి వికాస వాహిని సంస్థ అధ్యక్షులు వి.కేశవరావును ప్రత్యేకంగా అభినందించారు. వి.కేశవరావు మాట్లాడుతూ నేటి బాలబాలికలు గ్రంథాలయాలను తరచుగా సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్ట్స్ సొసైటీ కార్యదర్శి పావులూరి చిదంబేశ్వరరావు, విజయవాడ లైన్స్ క్లబ్ జోనల్ సెక్రెటరీ మహమ్మద్ ఇస్మాయిల్ గ్రంథాలయ అధికారి కె.రమాదేవి సిబ్బంది కె.రాంబాబు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠకులు పాల్గొన్నారు.


వెయ్యి రూపాయల నగదు మొదటి బహుమతి పొందిన తనుషా



కలెక్టర్, సిపి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రిఫరీ రవి

ఉత్తమ కబడ్డీ రిఫరీగా రవి

ప్రజాశక్తి - నందిగామ : ఉత్తమ వ్యాయామ కబడ్డీ రిఫరీగా నందిగామకు చెందిన పిఇటి జక్కులూరి రవి, ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ కమీషనర్ రాజశేఖర్ బాబు, కలెక్టర్ లక్ష్మీశ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. ఇటీవల విజయవాడ పోలీసు ఎఆర్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ జరిగాయి. కబడ్డీ, చెడుగుడు పోటీల్లో జక్కులూరి రవి రిఫరీగా ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రవిని అభినందిస్తూ అధికారులు ఉత్తమ కబడీ రిఫరీ అవార్డు అందజేశారు. ఉత్తమ కబడ్డీ రిఫరీ అవార్డు గ్రహీత జక్కులూరి రవిని నందిగామకు చెందిన పలువురు ప్రముఖులు, మేధావులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.


నందిగామ రైతు పేటలో తీసిన గుంత

గుంతలు తీశారు... పూడ్చటం మరిచారు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపాలిటీ అధికారులు గుంతల తీశారు .పూడ్చడం మరిచారు. నందిగామ రైతు పేట నారాయణ స్కూల్ పక్కన వాటర్ పైప్లైన్ మరమతుల కోసం గుంతలు తవ్వారు. మున్సిపాలిటీ అధికారులు వాటర్ లైన్ పనులు మాత్రం నిర్వహించారు. కాని తీసిన గుంతలు మాత్రం నెల రోజుల అయినను పూడ్చడం లేదు. మెయిన్ రోడ్డు నుండి లోపలికి వెళ్లే స్కూల్ పిల్లలు,కాకతీయ అపార్ట్మెంట్ లోపలికి వెళ్లే వద్దులు పెద్దలు ఈ గుంతల వల్ల ఇబ్బందికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు కు మట్టి నింపి చదును చేయాలని రైతు పేట ప్రజలు కోరుతున్నారు.


బహుమతులు అందుకున్న బాలబాలికలు

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామంలో సిఎస్ఐ క్రైస్ట్ చర్చి సండేస్కూల్ బాలబాలికలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సండేస్కూల్ ఆర్గనైజర్ చాట్ల విజయ్ కుమార్ మాజీ కౌన్సిల్ మెంబర్ సిహెచ్.శ్యాంబాబు, పెద్దలు మల్లాది రాజారావు, శిఖామణి, ఆదాము, మల్లాది వెంకట్, సండేస్కూల్ టీచర్ సిహెచ్.హన్న, మారెపోగు రత్న కుమారి, చాట్ల ధర్మకుమారి, సగ్గుర్తి విజయకుమారి, చాట్ల దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు వైశ్య సమాజ ఆధ్వర్యంలో ఆర్య వైశ్యుల వన సమారాధన సందడి సందడిగా జరిగింది. చిన్నపిల్లల దగ్గర నుండి మహిళలు సైతం ఉత్సాహంగా ఆటపాటల్లో పాల్గొని కేరింతలు కొట్టారు. జగ్గయ్యపేట ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య, తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని వన సమారాధన విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సమాజం అధ్యక్షులు గుడిమెట్ల మురళి ఆర్యవైశ్య ప్రముఖులు కొత్తగుండ్ల ప్రసాదరావు, కంచర్ల ముత్యాప్రసాద్, సంక రాజారావు, కొల్లిపర సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ధర్మవరప్పాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణరావు 'నా చిట్టి చేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో' బాలకార్మికోసం పాడిన పాటకు గోల్డ్ మెడల్‌ను, ఫొటోగ్రఫీ పోటీలో బెస్ట్‌ఫొటో గ్రాఫర్‌గా ఫస్ట్ ప్రైజ్ ప్రశంసా పత్రాలు ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు పైడి వెంకట రమణ చేతులు మీదుగా అందజేశారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలోని లయోలా కళాశాలలో 1, 2వ తరగతి బోధిస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుకు నవంబర్ 25 నుండి 30వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. 3వ బ్యాచ్ 6 రోజుల పాటు జరిగిన ఎఫ్ఎల్ ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణ కార్యక్రమంలో విద్యాబోధనోపకరణ, ఆటలు పాటలు, సాంస్కృతిక, యోగా, ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎంఒ అశోక్, జిల్లా జిసిడిఒ శాంతి, విజయవాడ ఎంఇఒ విజయరామారావు, ఎ.కొండూరు ఎంఇఒ కేశవరావు పాల్గొన్నారు.

'మన ఊరు - తిరువూరు' కార్యక్రమంలో ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తిరువూరు : ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం మన ఊరు - తిరువూరు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి సమస్యలు సేకరించారు. తిరువూరు పట్టణంలోని రాజుపేట ఒకటో వార్డులో ఇంటింటి తిరుగుతూ సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని, ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏమన్నా సమస్యలుంటే తప్పకుండా పరిష్కరిస్తానని చెప్పారు. డ్రైనేజీ, రోడ్లు పరిశీలించారు. మీకు ఏ సమస్య వచ్చినా ఎప్పుడైనా నా దగ్గరకు రావచ్చని ప్రజలకు భరోసా ఇచ్చారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ కొలికపూడి

పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని అన్నవరం గ్రామంలో ఇటీవల వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న సంగెపు భువన్ సాయి 2,93,636, అప్పనబోయిన నాగరాజులకు 30,392 ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య అందజేశారు. స్థానిక నాయకులతో కలిసి అన్నవరం గ్రామంలో ఆదివారం బాధితుల ఇంటికి వెళ్లి ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా కల్పిస్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉండి వైద్యం చేయించుకోలేని వారికి చేయూతనిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలా మారిందన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని మెరుగైన వైద్యం నిమిత్తం వివిధ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, డోగుపర్తి విష్ణు, కవి, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ శ్రీరాం



ఎలుకల నివారణకు బోను వాడాలి

ప్రజాశక్తి వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడులో 'గ్రామీణ పని అనుభవ' కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు వరిలో ఎలుకల నివారణ కొరకు బోనులు వాడాలని, వాటిని వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు హర్షవర్ధన్ రెడ్డి, ఖలీల్, ఆంజనేయులు, దుర్గాప్రసాద్, బాలకోటి రెడ్డి రైతులకు అవగాహన కల్పిస్తూ వారి మన్నలను పొందారు. ఇందులో పి.శ్రీనివాస్‌రావు పి.రామకృష్ణ, నాగేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఈ ప్రాంత రైతుల వ్యవసాయ క్షేత్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ



ప్రజాశక్తి - నందిగామ : తుపాను, వర్షపాతం దృష్ట్యా రైతులు, అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నందిగామ ఆర్‌డిఒ బాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు వరి పంటకోతలను కనీసం 2 రోజులు వాయిదా వేసుకోవాలని కోరారు. రైతులు వారి పంటను కోసిన వెంటనే కొనేలా క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. క్షేత్రస్థాయి కార్యనిర్వాహకులందరూ రైతులు కోరినప్పుడు, ఏదైనా సహాయం కోసం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏ రైతూ కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్మకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పండించిన వరిని సేకరించేలా లేదా వర్షం కారణంగా అత్యవసర సమయంలో సురక్షితమైన స్థలంలో ఉంచేలా చూడాలని కోరారు. కోసిన ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రాలలో తగిన గోనె సంచులు అందుబాటులో ఉంచి నట్లు తెలిపారు. అందరు ఎంఎ ఒలు, తహశీల్దార్లు వారికి సంబంధించిన విఎఎ, విఆర్‌ఒలు సదనుగుణంగా అప్రమత్తం చేయాలని కోరారు.

వెండి వస్తువులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ముక్త్యాలలో గల భవానీ ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం ఆదివారం ఆఖరి రోజు సందర్భంగా దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో దేవస్థాన అర్చకులు, వేద పండితులు, పురోహితుల వారిచే లక్ష బిళ్వార్చన నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.యల్. ఇందిరాదత్తు పూజ సామాగ్రి మొత్తం సమర్పించారు. ఈ దేవాలయంలో గల శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలోని శ్రీ స్వామికి 1 కేజి 388 గ్రాముల 600 మిల్లి గ్రాములు ఉన్న వెండి పంచె-1 రాజ్యలక్ష్మీ అమ్మవారికి 2 కేజి 405 గ్రాముల 800 మిల్లి గ్రాములు ఉన్న వెండి హస్తం-1, పెద్ద హస్తం-1, వెండి కీరిటం-1 మొత్తం సుమారు రూ.4,10,011 లు విలువ గల వెండి వస్తువులను ఇందిరాదత్తు స్వామి, అమ్మవారికి అలంకరణ నిమిత్తం దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ ప్రసాద్, యాత్రికులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం పేదలకు వస్త్ర దానం, పేదలకు విద్య, వైద్య సహాయాన్ని అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, సోదరుడు రాజారావు వారి మాతృమూర్తి పుణ్యతిథి (వర్ధంతి) సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థికి రూ.5వేలు, పేద వ్యక్తి వైద్య సాయం నిమిత్తం మరొక రూ.ఐదు వేలు, 30 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని హెచ్ఐవి బాధిత పిల్లలకు రూ.పదివేల విలువైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాజారావు, శ్రీదేవి, భారతి, రాయపూడి వెంకటేశ్వరరావు, శ్రేయస్సు సిబ్బంది రాజశేఖర్, విజయ కుమారి ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

వెనిగండ్ల రాము పుట్టినరోజు వేడుకలు



నందివాడలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ప్రజాశక్తి - గుడివాడ : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుట్టినరోజు వేడుకలు ఆదివారం నియోజవర్గంలో అన్ని మండలాలు, పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు ఎన్‌టిఆర్ స్టేడియంలో క్రీడాకారుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక ఏలూరురోడ్డులోని వెనిగండ్ల కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాము పుట్టినరోజు వేడుకల్లో కేక్ కట్ చేసి పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, విశ్వభారతి సంస్థల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, టిడిపి నాయకులు అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీ రయ్య(బాబ్జి), ఎయిర్‌పోర్టు అభివృద్ధి కమిటి సభ్యులు కామేపల్లి తులసిబాబులు పాల్గొని ఎమ్మెల్యే రాముకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, సందు పవన్, తెలుగు యువత నాయకులు నిమ్మగడ్డ సాయి, కడియాల గణేష్, పంచకర్ల మహేష్‌ల ఆధ్వర్యంలో వెనిగండ్ల పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరి జగన్మోహన్రావు, గుడివాడ 36 వార్డులు, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, అధికారులు వెనిగండ్ల రాముకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

నందివాడలో పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందివాడ : నందివాడ మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుట్టినరోజు వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన నందివాడ గ్రామంలో జరిగిన వేడుకల్లో టిడిపి శ్రేణులు, మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూల మొక్కలు, జ్ఞాపికలతో ఎమ్మెల్యే రాముకు పార్టీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండల టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పార్టీ నాయకులకు తినిపించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, ఏపీ ఎస్ డబ్ల్యూ సి ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, చేకూరి జగన్ మోహన్ రావు, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, మండల పరిధిలోని అనేక గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.





కోలాహలంగా వన సమారాధనలు



నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో వడ్లమూడి గౌతమేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో 100 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు పెరుమాళ్ళు, వైపీసీ ప్రసాద్, పరంధామయ్య, రామకష్ణ, విశ్వేశ్వరరావు, మోహనరావు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చల్లపల్లి : కార్తీక మాసం ఆదివారం చివరి రోజు కావడంతో మండల పరిధిలోని నడకుదురులో వేంచేసి యున్న పథ్వీశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. చల్లపల్లిలోని ఎస్‌ఆర్‌వైఎస్‌పి జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థిని, విద్యార్థులు కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించు కుంటూ కళాశాల స్మతులను తలుచుకుంటూ ఆనందంగా గడిపారు. ఉసిరి వనంలో ప్రత్యేకంగా వేసిన పందిళ్ళ నడమ తమ స్నేహాన్ని ఒకరితో మరొకరు పంచుకుంటూ సహ పంక్తి భోజనాలు చేశారు.. కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా ఎస్ఆర్వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తగిరిశ సాంబశివరావు మాస్టారు దంపతులను పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



వనసమారాధనలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముగిసిన పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్





ప్రజాశక్తి-విజయవాడ : ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ముగింపు వేడుకలు సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ గ్రౌండ్లో ఉత్సాహ వంతమైన, ఆహ్లాదకరమైన సందడి వాతావరణంలో ఘనంగా ముగిసాయి. ఎన్.టి.ఆర్.జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముగింపు వేడుకలకు ముఖ్య అతిధులుగా విచ్చేయగా వారిని పోలీస్ కమిషనరేట్ తరపున నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు , పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా సాదర స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం క్రీడల్లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది,అధికారుల నుండి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించి గెలుపొందిన విజేతలను అభినందించారు.

ఆయా క్రీడల్లో గెలుపొందిన విజేతలు...

మహిళా విభాగం లో కబడ్డీ, త్రోబాల్ లలో ఈస్ట్ జోన్ బందం,టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, బాస్కెట్ బాల్ వాలి బాల్ ఆటలలో క్రైమ్ సి. ఎస్.బి విభాగం వారు , సి. ఏ. ఆర్ రెండు బందల వారిని విన్నర్లు గా నిలిచారు. అలాగే ఒవరాల్ ఛాంపియన్ సి.ఏ.ఆర్. జోన్, కైవసం చేసుకోగా, పురషుల బెస్ట్ అతలేంటిక్ ఏ. ఆర్ పి. సి. లు బి ప్రదీప్ కుమార్ , ఎన్ విజయేంద్ర , మహిళల బెస్ట్ అతలేంటిక్ లు మహిళా హెచ్ సి ఆర్ సుజాత , పి. సి డి.కష్ణ వేణి లు గా నిలిచారు. వీరందరిని జిల్లా కలెక్టర్ , పోలీస్ కమీషనర్, ఇతర పోలీస్ అధికారులు అభినందించారు. ఈ నెల 28 నుంచి 30వతేదీ వరకు (మూడు రోజుల పాటు) జరిగిన పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024లో ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఏడు జోన్లు (1) క్రైమ్ అండ్ సి. ఎస్.బి. జోన్ (2) ఈస్ట్ జోన్, (3) ట్రాఫిక్ జోన్, (4) వెస్ట్ జోన్, (5) సి.ఏ.ఆర్, సి.ఎస్.డబ్ల్యూ జోన్ (6) రూరల్ జోన్ మరియు (7) సి.పి. ఒ. స్టాఫ్ గా ఏర్పడి పాల్గొన్నారు. ఈ క్రీడల్లో కబడ్డీ, వాలీబాల్, టగఫ్ వార్, హ్యాండ్ బాల్, బాస్కెట్బాల్, త్రోబాల్, షటిల్ బాట్మింటన్, రన్నింగ్ 100 మీటర్స్, 200 మీటర్స్, 400 మీటర్స్, 800 మీటర్స్, 1500 మీటర్స్, 4ఐ100 మీటర్స్ రిలే, 4ఐ400 మీటర్స్ రిలే తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ క్రీడలు ఆడటం వలన క్రమశిక్షణ వస్తుందని తెలియజేశారు. ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదో ఒక వ్యాయామం తప్పనిసరని, తద్వారా శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. ముఖ్య అతిధి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా క్రీడలు ఆడటం వలన క్రమశిక్షణ వస్తుందని తెలిపారు. ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదో ఒక వ్యాయామం తప్పనిసరని, తద్వారా శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్ చేతులమీదుగా పతకాలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో డి.సి.పి.లు గౌతమీ షాలి, తిరుమలేశ్వర రెడ్డి , కష్ణమూర్తి ,ఎస్.వి.డి.ప్రసాద్ , జి.ఆనంద్ బాబు, ఏ.డి.సి.పి.లు, ఏ.సి.పి.లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి : రానున్న కాలంలో పాలకవర్గాలు అవలంబిస్తున్న విధానాల వలన ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటారని ఆ సమస్యల పరిష్కారానికై ప్రజా ఉద్యమాలు, పోరాటా లను ఉధృతం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం మంగళగిరి పట్టణ 24వ మహాసభ మంగళగిరి సిపిఎం కార్యాలయంలో మున్నంగి సుబ్బారావు నగర్‌లో నిర్వహించారు. మహాసభకు వివి జవహర్లాల్, పి బాలకృష్ణ, జె బ్రాహ్మణి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. మంగళగిరి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల భూముల్లో ఇళ్లు వేసుకొని అనేక సంవత్సరాలుగా నివాసముంటున్న 4000 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, రాజధాని ప్రాంతంలో మంగళగిరి పట్టణానికి చెందిన 6000 మందికి గత ప్రభుత్వం సెంటు స్థలం కేటాయించిందని వారందరికీ నివాస ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మహాసభ తీర్మానించింది. టిడ్కో గృహాల సముదాయాన్ని ముంపు నుండి కాపాడటానికి డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్మాణం చేయాలని, చేనేత కార్మికులకు బడ్జెట్లో రూ.2000 కోట్లు నిధులు కేటాయిం చాలని, నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని మహాసభ తీర్మానించింది. . సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, ఈమని అప్పారావు, ఎం రవి, జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ చిస్టి, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు పాల్గొన్నారు.

సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శిగా వివి జవహర్లాల్

సిపిఎం మంగళగిరి పట్టణ 24వ మహాసభ 13 మందితో నూతన కమిటీ, పట్టణ కార్యదర్శిగా వివి జవహర్లాల్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎస్ ఎస్ చెంగయ్య, వై కమలాకర్, ఎం బాలాజీ, పట్టణ కమిటీ సభ్యులుగా ఎస్ గణేష్, ఎం చలపతిరావు, టి శ్రీరాములు, టి శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, ఎం నాగేశ్వరావు, ఆర్ వేణు, ఎం శివచంద్రరావు, జే బ్రాహ్మణిలను ఎన్నుకున్నారు.

బియ్యం దొంగల్ని శిక్షించాలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : పేదలకిచ్చే బియ్యాన్ని స్మగ్లింగ్ ద్వారా విదేశాలకు తరలిస్తున్న బియ్యం దొంగల్ని చట్టం ముందు ప్రవేశపెట్టాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. ఆదివారం అరండల్ పేట లోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాణిక్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ హయాంలో వైసిపి నాయకులు పేదల బియ్యాన్ని విదేశాలకు తరలించి రూ. 15 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ కుంభకోణాన్ని వెలికి తీసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని కుంభకోణాలతో పాటు పేదలకు ఇచ్చే బియ్యాన్ని సైతం వదిలి పెట్టలేదని, పేదల బియ్యాన్ని బొక్కినవారి పొట్టలను చీల్చి బియ్యాన్ని రాబట్టాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంతేకాక ఇంటింటికి బియ్యాన్ని అందించే వాహనాలు, సంచార పశు వైద్య శిబిర వాహనాలు, ఆరోగ్య శ్రీ, 108, 104 తదితర వైద్య సేవల వాహనాల కొనుగోళ్లలో సైతం వారిద్దరూ భార్య కుంభకోణానికి పాల్పడ్డారని తెలిపారు. వీటిపై ముఖ్యమంత్రి విచారణకు ఉన్నత స్థాయి అధికారులు నియమించిబాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కరెన్సీలో దేశ చరిత్ర, సంస్కృతి దాగి ఉన్నాయి : కలెక్టర్ లక్ష్మీ శ

- ముగిసిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎగ్జిబిషన్

- హాజరైన గుంటూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సిఐడి ఎస్‌పి చక్రవర్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శ్రీధర్ సిసిఇ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కరెన్సీ అండ్ కాయిన్స్ ఎక్స్‌పో 2024 కార్యక్రమంలో భాగంగా చివరి రోజు ఆదివారం, ఇంటర్నేషనల్ కాయిన్ కరెన్సీ ప్రదర్శనను కలెక్టర్ లక్ష్మీ శ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కరెన్సీ నాణెంలో, నోట్‌లో దేశ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించబడిందన్నారు. వారసత్వ సంపద పట్లయువత ఆసక్తి కనబరచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని సూచించారు. గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నాణేలు, కరెన్సీలు సేకరించడం కేవలం హాబీగా కాకుండా జ్ఞానం పెంపొందించే విద్య అని కొనియాడారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చరిత్రపట్ల అవగాహన పెరుగుతుందని అన్నారు. సిఐడి ఎస్‌పి కె.చక్రవరి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఈ సంపదను సంరక్షించడంలో అందరి పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు. తానా పూర్వ అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కరెన్సీ ఎగ్జిబిషన్ ఒక అద్భుతం, అసామాన్యమని ఇలాంటి ప్రదర్శనను రాష్ట్రంలోనే కాక దేశ రాజధానిలో కూడా నిర్వహించేందుకు తన వంతు సహకరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తానా సభ్యులు జిల్లెలు మూడి వెంకట్, తానా మాజీ సెక్రెటరీ కొల్లా అశోక్, ప్రముఖ వాస్తు సిద్ధాంతి గోటూరి పాములు సందర్శించారు. అనంతరం నిర్వాహకులు సిసిఇ శ్రీధర్ అతిథులను సత్కరించారు.



ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్

ఆకట్టుకున్న ప్రదర్శనలు....

ఆంటిగ్వా, బార్బుడా దేశం 1990లలో బంగారం, వెండి పదార్థాలతో ప్రత్యేకంగా తయారు చేసిన నోట్లను విడుదల చేసింది. ఈ నోట్లు వీక్షకులను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదేశపు జాతీయ చిహ్నాలు సాంస్కృతిక చిత్రాలతో అందంగా రూపుదిద్దుకున్న వీటిని సెల్‌ఫోన్‌లలో క్లిక్ అనిపించి భద్రపరుచుకున్నారు. ప్రెసిడెన్సీ (బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వాళ్ళు) ముద్రించిన రూకలు, డబ్బు, వరహాలు, తెలుగు లిపిలో ముద్రించబడ్డాయి. ఒక వరహా అంటే మూడున్నర రూపాయలు, 42 రూకలు ఒక వరహాగా చెలామణి అయిన గోల్డెన్, సిల్వర్ కాయిన్స్, కాపర్ కాయిన్స్ ప్రదర్శనలో ఉంచారు.

హైదరాబాద్ నిజాం నాటి సిల్వర్ కాయిన్స్, పేపర్ కరెన్సీ, 1556-1858 వరకు మొగల్ పరిపాలనలో అక్బర్, జహంగీరు, షాజాహాన్, ఔరంగజేబు కాలం నాటి సిల్వర్ కాయిన్స్ కనువిందు చేశాయి. ఇండోర్, కొచ్చి స్టేట్ కాయిన్స్, ఆకర్షణీయంగా నిలిచాయి. భారతదేశానికి స్వతంత్రం రాకముందు బర్మా దేశంలో రూపాయిగా చలామణి అయిన జపాన్ దేశం ముద్రించిన నోట్లు అధితులను ఆకట్టుకున్నాయి.



నందిగామలో పోస్టాఫీసు వద్ద గుంపులు గుంపులుగా కూడిన జనం

పోస్టాఫీస్ ఖాతాకు తిప్పలు

డబ్బులు వేస్తారంటూ ప్రచారం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో కొన్ని రోజులు పోస్ట్ ఆఫీస్ నుంచి వచ్చాం ఇంటి దగ్గర ఖాతా తీస్తున్నామని చెప్పి ప్రభుత్వ పథకాల డబ్బులు పడాలంటే పోస్ట్ ఆఫీస్‌లో తప్పనిసరి కాదా ఉండాలని చెబుతున్నారు. వార్డుల్లో మహిళలును అడిగితే 1500 పడుతున్నాయి అంట అందుకోసమే ఖాతా తీరుస్తున్నామని తెలిపారు. ఒకవేళ పోస్ట్ ఆఫీస్ లో ఖాతా లేకపోతే డబ్బులు రావని భయంతో పోస్ట్ ఆఫీస్ లకు వెళ్తున్నారని చెబుతున్నారు. 200 రూపాయలు రుసుముతో పోస్ట్ ఆఫీస్ ఖాతా తెరిచేందుకు పిల్లలతో సహా ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పోస్ట్‌ఆఫీస్‌లో ఖాతా ఉంటేనే డబ్బులు వస్తాయి అని ప్రచారం బాగా జరుగుతుందని సమాచారం. సరే ఖాతానే కదా అని అనుకుంటే 200 రూపాయల కట్టించుకున్నా రసీదు లేదు, పోనీ ఖాతా డీటెయిల్స్ తెలియాలంటే అదే తెలియడం లేదు. ఒటిపి వస్తుంది... ఫోన్‌లోనే ఖాతా నెంబర్ ఉంటుందని చెబుతున్నారు. రూ.200 కట్టామా ఫోన్లో మెసేజ్ వచ్చిందా.... అంతవరకే తెలుసని చెబుతున్నారు.

వాయుగుండం ప్రభావంతో రైతులకు పాట్లు

ప్రజాశక్తి - వత్సవాయి : బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా మండలంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వరి పంటలు కోత దశకు రావటంతో గింజలు రాలిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల మిషన్ల సహాయంతో కోసి కల్లాల్లోనే ఆరబోయటంతో రైతులు పట్టాలు కప్పి తడవకుండా కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నం అయ్యారు. వత్సవాయి మండలంలో 10వేల హెక్టార్లకుపైగా వరి సాగు చేపట్టారు. పంట చేతికి వచ్చే తరుణంలో అకాల వర్షాల వల్ల రైతులు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంగల్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు నానా పాట్లు పడుతున్నారు. శనివారం సాయంత్రం ఆదివారం సాయంత్రం అక్కడ అక్కడ పడ్డాయి. పొలాల్లో కోసిన ధాన్యాన్ని మెరక ప్రదేశాలకు తీసుకెళ్లి పట్టాలపై ఆరబోసుకుంటున్నారు. తుపాను ప్రభావంతో ధాన్యాన్ని పట్టాలతో కప్పుకొని తడవకుండా కాపాడుకుంటున్నారు. కొన్ని చోట్ల బోసిన ధాన్యాన్ని పూర్తిగా ఎండిపోవడంతో బస్తాలకు పట్టుకొని ఇళ్లల్లోకి చేర్చుకుంటున్నారు తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని పట్టాల మీద ఉంచి వర్షం తగ్గిన తర్వాత ఆరబెట్టుకుందామని కల్లాల్లోనే రాశులు పోసి ఉంచుకుంటున్నారు. కొన్నిసార్లు గ్రామాల్లో ఇందుకుపల్లి, కన్నివేడు చిట్యాల, పెద మధు పల్లి తదితర గ్రామాల్లో తుపాను ప్రభావిత గాలులతో వరిపైరు నేలకొరిగిపోయింది. అక్కడక్కడ సగం కోసిన పొలాలు ఈ తుపాను వల్ల అలాగే ఉండిపోయాయి. వరి మిషన్‌లో సైతం కూడా పొలాల్లోనే ఉండిపోయాయి. వర్షం ఎప్పుడు పోతుందో అని రైతులు ఎదురుచూస్తున్నారు.



ధాన్యం కల్లాల్లో ఆరబెట్టుకుంటున్న రైతులు

కోడిగుడ్లు కొ(తి)నలేం

రిటైల్ మార్కెట్లో రూ.7కు చేరిన కోడిగుడ్డు

- సామాన్యులకు పోషకాహారం దూరం



ప్రజాశక్తి - కంచికచర్ల : ఒక పక్క నిత్యావసర సరుకుల ధరల ఆకాశాన్నంటి సామాన్యులు విలవిల్లాడుతుంటే, మరో పక్క కోడిగుడ్ల ధరలు ఆకాశానికి ఎగబాకి సామాన్యుడికి అందుబాటులో లేని స్థితిలోకి ధరలు పెరిగాయి. నిన్న మొన్నటి వరకు బహిరంగ మార్కెట్లో ఆరు రూపాయల లోపు కోడిగుడ్డు ధర పలకగా ఇప్పుడు దాదాపు కోడిగుడ్డు ధర రిటైల్‌గా ఆరున్నర నుండి ఏడు రూపాయలు ధర పలుకుతుంది. కోడిగుడ్డు అన్ని వర్గల ప్రజలు వాడుతుంటారు. కోడిగుడ్డు పోషకాహారం, ముఖ్యంగా, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు కోడిగుడ్డు శ్రేయస్కరమని వైద్యులు సూచిస్తుంటారు. ఆదివారం వచ్చిందంటే మాంసాహారం కొనలేని పేదలు కోడిగుడ్డు వాడతారు. ఇలాంటి కోడిగుడ్డు ధర ఒక్కసారిగా పెరగటంతో సామాన్యులు కోడిగుడ్డు కొనలేని పరిస్థితి దాపురించింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటినప్పుడు సామాన్యులు ఎక్కువమంది కోడిగుడ్ల మీద ఆధారపడి జీవించారు. అయితే కోడిగుడ్డు ధర పెరగటానికి లేయర్ ఫారంలో కోళ్ల పెంపెకం దారులకు పెరిగిన ఖర్చులేనని వ్యాపారులు అంటున్నారు. దీనికి తోడు డిసెంబర్, జనవరి నెలలో కోడిగుడ్డు వాడకం పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు ఇప్పటి నుండే ధరలు పెంచారని వినియోగదారులంటున్నారు. రాబోయే క్రిస్మస్, నూతన సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని నెక్ హోల్‌సేల్ ధర మార్కెట్లో 5.90 పైసలుగా నిర్ణయించింది. కోడిగుడ్లను కేకులలో ఎక్కువగా ఉపయోగిస్తారు కనుక నెక్ ఆకస్మికంగా కోడిగుడ్ల ధరను పెంచిందని అనుకుంటున్నారు. చలికాలం గుడ్ల వినియోగం పెరగటం మరొక కారణం కావడంతో సామాన్యుడికి అందుబాటులో లేని విధంగా కోడిగుడ్ల ధరలు పెరిగాయని రిటైల్ వ్యాపారులు అంటున్నారు.

హెల్మెట్ ధారణ- రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణం, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్‌పై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశాల మేరకు రూరల్ డిసిపి ఉమామహేశ్వర రాజు పర్యవేక్షణలో నందిగామ ఎసిపి ఎబిజి తిలక్ ఆధ్వర్యంలో, జగ్గయ్య పేట ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు వారి సిబ్బందితో కలిసి జెండా ఊపి సుమారు 250 మోటారు వాహనాలు (బైకులు)తో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జగ్గయ్య పేట టౌన్ పాతగెడ్డ వద్ద నుండి మొదలై బలుసుపాడు సెంటర్ - ఎన్‌టిఆర్ సర్కిల్ - కోదాడ రోడ్డు - కమలా థియేటర్ వరకు వినూత్నంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకు రోడ్డు ప్రమాదాల నుండి రక్షణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, 'సేఫ్టీ ఫస్ట్ హెల్మెట్ మస్ట్' అను నినాదంతో హెల్మెట్ ఆవశ్యకత తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే మృత్యువాత పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించకపోవడమే కారణం అన్నారు. ముఖ్యంగా యువత వాహనాలను నడిపే సమయంలో ఎంతో జాగ్రత్త వహించాలన్నారు. నిర్లక్ష్యంగా, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, మీ ఇంటిలోని వారు మీ మీద చాలా ఆశలు పెట్టుకుని జీవిస్తారని వారికి తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులను రోడ్డు ప్రమాదాల బారి నుండి రక్షించే ప్రయత్నంలో భాగంగా హెల్మెట్ల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రోడ్డుపై హెల్మెట్ లేకుండా వెళ్తున్న వాహనదారులకు వినూత్నంగా గులాబీ పూలను అందించి హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎసిపి ఏ.బి.జి.తిలక్, జగ్గయ్య పేట ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది 500 మంది పాల్గొన్నారు.



విజయవాడలో నిర్వహించిన ర్యాలీలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కవులకు సత్కారం

ప్రజాశక్తి - తిరువూరు : అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ విజయవాడలో నిర్వహించిన శత కవుల సమ్మేళనంలో తిరువూరు కవులకు ఘన సత్కారం లభించింది. విజయవాడలోని బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో తెలుగు పోయెట్రి ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన శతకవుల సమ్మేళనంలో తిరువూరుకు చెందిన ప్రముఖ కవి విశ్వనాధునిశంకరాచారి, కవయిత్రి ఈడే వెంకట భరతకుమారిలు కవితా పఠనం చేశారు. మంచి కవితా పఠనం చేసిన ఇరువురిని కళారత్న డాక్టర్ పొట్లూరి హరికృష్ణ, అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కె.విజయ లక్ష్మి అభినందించి జ్ఞాపిక, శాలువ, ప్రశంసా పత్రం బహూకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి శతకవులు, కవయిత్రులు పాల్గొని, వివిధ సామాజిక సమస్యలను ఎంచుకుని కవితా గానం చేసి, ఘన సత్కారం పొందారు.

